విశాలాంధ్ర
శుక్రవారం 15, డిసెంబర్, 2023

అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు వెంటనే తెరిపించాలి

గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సచివాలయ సిబ్బందికి తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించాలి

మునిసిపల్ కమిషనర్‌లు, ఎంపిడిఓలకు కలెక్టర్ ఆదేశాలు

విశాలాంధ్ర-విజయనగరం : రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం పొందుతున్న పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవల్లో అంతరాయం కలగకుండా, వారికి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు వాటిని వెంటనే తెరిపించి సేవలు కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు, సి.డి.పి.ఓ.లను ఆదేశించారు. జిల్లాలోని మునిసిపల్ కమిషనర్‌లు, ఎంపిడిఓలు, సిడిపిఓలు జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల తాళాలను సి.డి.పి.ఓ.ల ఆధ్వర్యంలో గురువారం నాడే స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే సంక్షేమ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వి.ఆర్.ఓ.లు తదితర సచివాలయ సిబ్బందిలో ఒక్కొక్కరికి ఒక్కో సచివాలయం బాధ్యతలు అప్పగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుండి అన్ని అంగన్ వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటలకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో తెరవాలని, పిల్లలను ఆయా కేంద్రాలకు రప్పించాలని ఆదేశించారు. వ్యవసాయ, విద్యుత్, పశుసంవర్ధక సహాయకులు, ఏ.ఎన్.ఎం.లు వంటి సిబ్బందికి అంగన్‌వాడీ బాధ్యతలు అప్పజెప్పవద్దని సూచించారు. ఈరోజు ఉదయం 11 గంటల్లోగా ఏ సచివాలయ సిబ్బందికి ఏ అంగన్‌వాడీ బాధ్యతలు అప్పగించింది పేర్కొంటూ ఉత్తర్వులు జారీచేయాలని పేర్కొన్నారు. ఆయా అంగన్‌వాడీల పరిధిలో తల్లులకు శుక్రవారం నుండి ఉదయం 9 గంటలకు కేంద్రాలను తెరవడం జరుగుతుందనే సమాచారం తెలియజేయాలన్నారు. సచివాలయ సిబ్బంది బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయా కేంద్రాల్లో స్టాకును గుర్తించి మిగిలి వున్న టేక్ హెూం రేషన్ పంపిణీని పూర్తిచేయాలన్నారు. స్కూళ్ల ప్రాంగణాల్లో అంగన్‌వాడీలు నడిచే చోట పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండించే ఏజెన్సీల ద్వారా ఆహారాన్ని తయారుచేసి అందించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. అంగన్‌వాడీ భవనాలు స్కూల్ ప్రాంగణాల్లో లేనిచోట స్వయంశక్తి మహిళా గ్రూపుల ఆధ్వర్యంలో పౌష్టికాహారం వండించి పిల్లలు, గర్భిణీలకు అందించే ఏర్పాట్లు చేయాలని డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరక్టర్‌ను ఆదేశించారు. పట్టణాల్లో సచివాలయాల్లో తగినంత సిబ్బంది అందుబాటులో లేనట్లయితే ఇతర మునిసిపల్ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు. టెలికాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టు డైరక్టర్ శాంతకుమారి, జెడ్పీ సిఇఓ రాజ్‌కుమార్, డి.ఇ.ఓ. లింగేశ్వర్

తుఫాను రైతులకు న్యాయం చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: తుఫాను రైతులకు న్యాయం చేయాలని, తుఫాను కరువు బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు అనంతరం డిఆర్ఓ అనితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లా డుతూ తుఫాను, కరువునష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్రం తక్షణసాయంగా వెయ్యి కోట్లు, పూర్తి స్వయంగా 10వేల కోట్లు ప్రకటించాలన్నారు. నష్టపోయిన పంటల ను గుర్తించి అక్రమాలు జరగకుండా పూర్తిస్థాయి లో రైతులకు న్యాయం చేయాలన్నారు. నష్టపోయిన ఆహార పంట లకు ఎకరాకు 30వేలు, వాణిజ్య పంటలకు 50వేల ఉద్యాన పంట లకు 75 వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని అన్ని పంటలకు పంటల బీమా వర్తించేలా చూడాలన్నారు.రెండో పంట వేసుకునేందుకు అవసరమైన రుణాలు, విత్త నాలు ప్రభుత్వమే ఉచితంగా అందించాలన్నారు. సాగునీరు మరుగునీరు కాలువ లకు మరమ్మతులను చేయాలని తడిసిన మొలకెత్తిన ధాన్యాన్ని ప్రతి, మిర్చి అన్ని పంటలను ఎటువంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాల న్నారు. కార్యక్రమంలో భాగంగా కోలాటం కళాకారులు రైతుపాటలకి కోలాటం నృత్యం ప్రదర్శించారు. జనసేన పార్టీ నాయకులు గురనాఅయ్యలు తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి బుగత అశోక్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్ది కృష్ణ,ఎస్ రంగరాజు, బుగత పావని, బాయి రమణమ్మ, జిల్లా సమితి సభ్యులు కేబీముడు, బి గౌరి నాయుడు, పురం అప్పారావు, ఎస్ సునీల్,కె స్రవంతి, గంట్యాడ మండల కార్యదర్శి కాళ్ళకృష్ణ, ఎస్‌కోట నియోజకవర్గ కార్యదర్శి దేగల అప్పల రాజు, నెల్లిమర్ల మండలం నాయకులు పాపారావు, విజయనగరం నియోజకవర్గ సభ్యులు పొందూరు రాంబాబు, పొందూరు అప్పలరాజు, ఉంగరాల జయలక్ష్మి, పింకీలక్ష్మీ, వద్దాది కొండలరావు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రైవాడ కాలువపై వంతెన కూలినా పట్టని అధికారులు

అవస్థలుపడుతున్న కేఅర్ పేట గ్రామస్తులు

విశాలాంధ్ర-వేపాడ: విశాఖ నగరవాసుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన రైవాడ కాలువపై మండలం లోని కృష్ణారాయుడుపేట వద్ద నిర్మించిన వంతెన కూలిపోయి 3నెలలు గడుస్తున్నా జీవిఎంసి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కృష్ణారాయుడుపేట నుంచి రైవాడ కాలువ మీద నిర్మించిన వంతెన మీదుగా శివారు గ్రామం అంకాజోష్యులపాలెం దాటి కే.డి రోడ్డుకు అనునిత్యం ఈ రెండు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కేడిరోడ్డు నుంచి అటు విశాఖ ఇటు అనకాపల్లి జిల్లాకు వెళ్లాల్సిన ప్రజలు 3 నెలలుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో చేసేది లేక గ్రామస్తులు తాత్కాలికంగా రైవాడ కాలువపై కర్రలతో ఏర్పాటుచేసిన వంతెనపై ప్రస్తుతం కాలినడకన రాకపోకలు సాగిస్తున్నప్పటికి అల్పంగా ఉన్న ఆ కర్రల వంతెన కూడా కూలిపోయే ప్రమాదం ఉంది. దాంతో గ్రామస్తులు భయంభయంతో రాకపోకలు సాగిస్తున్నారు. కానీ జీవిఎంసి అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే గ్రామ సర్పంచ్ చెలుబోని ముసలి నాయుడు (బాలబాబు) చెప్పిన ప్రకారం చూస్తే అధికారులు వచ్చి పరిశీలన చేసారని, కానీ వంతెన నిర్మాణం పనులు మాత్రం ఇంకా ప్రారంభించలేదన్నారు. ఇప్పటికైనా జీవిఎంసి అధికారులు స్పందించి రైవాడ కాలువపై వంతెన పనులు జరిపి గ్రామస్తుల ఇక్కట్లు తొలగించాలని కోరారు.

ఎస్టీలకు కల్పించిన పథకాలపై ఎస్టీ కమిషనర్ శంకర్రావు అవగాహన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో గురువారం ఎస్.టి. కమిషనర్ డి.వి.జి. శంకరరావు కి తెర్లాం మండలంలో ఎస్.టి.లకు సంబంధించి ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయములు, ప్రభుత్వం చేర వేసిన పథకాల వివరాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రామకృష్ణ తెలియజేశారు.

శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు

విజయనగరం-చీపురుపల్లి : చీపురుపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీలను గురువారం పి.వి.లక్ష్మి, తనిఖీదారు, దేవదాయ ధర్మదాయ శాఖ, విజయనగరం వారి సమక్షంలో దేవాలయంవద్ద తెరచి లెక్కించగా తే13.09.2023 ది నుండి 14.12.2023 ది వరకు రూ.3,61,993.00 వచ్చింది. కార్యక్రమంలో ఇప్పిలి సూర్యప్రకాష్ (ఛైర్మన్), సూరు వెంకట కుమార స్వామి (వైస్ చైర్మన్), వంకల కృష్ణ, రేగిడి అప్పలనాయుడు, కంది శ్రీరాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపిన నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ కోళ్ళ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగవరపుకోట మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎస్.కోటలో ఉన్న అంగన్‌వాడీలు, ఆయాలు మూడు రోజులుగా చేసున్న సమ్మెకు శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ కోళ్ళ లలితకుమారి, టీడీపీ నాయకులు గురువారం మోకాలిపై నిలబడి అంగన్వాడీల సమ్మెకు పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు అంగన్వాడీల న్యాయపరమైన సమ్మెకు టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాడు పాద`యాత్రలో అంగన్వాడీలకు మాట ఇచ్చిన జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అంగన్వాడీల, ఆయాలపైన బెదిరింపు చర్యలు చేయడం వైకాపా ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. 2024లో టీడీపీ రాగానే అంగన్వాడీల సమస్యలను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి, మీ సమస్యలు తీరేవిధంగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో శృంగవరపుకోట మండల పార్టీ ఉపాధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్, వార్డు మెంబెర్ పెదగాడ రాజు, భీశెట్టి మోహన్ కుమార్, సిపిఐ యం.రమణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30 మంది కేంద్ర బృందం గ్రామాల ఆర్థిక పురోగతిపై సమీక్ష

విశాలాంధ్ర-భోగాపురం: మండలం 9 రాష్ట్రాలకు చెందిన 30 మంది కేంద్ర బృందం సవరవిల్లి, నందిగాం గ్రామ పంచాయతీలను గురువారం సందర్శించారు. ఈ కేంద్ర బృందంలో ఐ ఎ ఎస్, గ్రూప్ 1 స్థాయి అధికారులు పాల్గొన్నారు. సవరవిల్లి గ్రామ పంచాయతీ లో సచివాలయ భవనము, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రం, భారత్ నిర్మాణ్ సేవ కేంద్రంలను సందర్శించారు ఇక్కడ జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామ పంచాయితీ పరిధిలో ప్రజలకు అందిస్తున్న వివిధ సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ లలో నిర్వహిస్తున్న బట్వాడా రెజిస్టర్లను, ఉపాధి హామీ పథకం కు సంబంధించిన 7 రిజిస్టర్స్ నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ భవనం లో డిజిటల్ అసిస్టెంట్ ఫ్రంట్ ఆఫీస్ నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. సవరవిల్లి సర్పంచ్ ఉప్పాడ విజయ్ భాస్కర్ రెడ్డి పంచాయితీ కార్యదర్శి గ్రామ పంచాయితీకి చెందిన విషయాలను తెలియజేసారు. అనంతరం నందిగాం గ్రామ పంచాయితీ సందర్సనలో భాగంగా, అమృత్ సరోవర్, చెత్తనుండి సంపద తయారీ షెడ్ల నిర్వహణ, కమ్యూనిటీ సోక్ పిట్లు, గ్రామ పంచాయితీ లో నిర్వహిస్తున్న వివిధ పారిశుద్ధ్య కార్యక్రమాలు, స్వయం సేవక్ సంఘాల ద్వారా నిర్వహిస్తున్న అగరబత్తిలు, కర్పూరం మొదలగు ఉత్పత్తుల పై స్థానిక సంఘాలతో చర్చించి, వారు సాధిస్తున్న ఆర్థిక పురోగతి పై చర్చించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నందిగాం సర్పంచ్ మురళీమోహన్ కార్యదర్శి కేంద్ర బృందానికి సంబంధించిన విషయాలను వివరించారు.

సెరికల్చర్ యూనిట్‌ను పరిశీలించిన ప్రతినిధుల బృందం

విశాలాంధ్ర-జామి: ఉపాది హామీ పథకంలో భాగంగా నిర్మించిన పలు సెరికల్చర్ యూనిట్‌లను వివిద రాష్ట్రాలకు చెందిన ప్రతినిధుల బృందం గురువారం మండలంలో పర్యటించింది. చత్తీష్ఘడ్,బీహార్, తెలంగాణా, కేరళ, మహారాష్ట్ర,ఒరిస్సా, రాష్ట్రాలకు చెందిన పలువురు ఈబృందంలో ఉన్నారు. వారికి మండలంలోని మోకాసా కొత్తవలసలో నిర్మించిన సెరికల్చర్ యూనిట్‌ను ఉపాధి హామీ పథకం మండల ఎపివో కె. శేఖర్ చూపించి, వాటి వివరాలను తెలియజేసారు. ఈయూనిట్‌ను పొటిపిరెడ్డి ఎర్నాయుడు అనే రైతుకు మంజూరు చేసినట్లుగా తెలియజేస్తూ ఉపాధి పథకంలో భాగంగా రూ.5,50,000, సెరికల్చర్ ద్వారా 3,18,000, లబ్దిదారుల వాటా 6,27,000లు కలిపి ఈయూనిట్‌ను ఏర్పాటు జరిగిందన్నారు. ఏడాదికి రూ.4లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతు వివరించారు. అదేవిదంగా పొటిపిరెడ్డి వెంకట సత్యంకు చెందిన గోశాల నిర్మాణ యూనిట్‌ను పరిశీలించారు. ఈఅధికారుల వెంట జాయింట్ కమీషనర్ ఎం.శివప్రసాద్, ఎస్‌కోట క్లస్టర్ ఎపిడి ఎస్.శారదాదేవి, సెరికల్చర్ ఎడి ఎవి.సాల్మన్‌రాజు, ఎపివో కిరణ్మయి పాల్గొన్నారు.

గిరిజనుల మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలి

ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తాడంగి ఎండు దొర

విశాలాంధ్ర-బొబ్బిలి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులు అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసి, అనేక చట్టాల అమలు చేస్తున్న గిరిజన గ్రామాల ప్రజలు సమస్యలు పరిష్కారం కాక గిరిజన గ్రామాల ప్రజలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నారని గిరిజనులకు అమలు చేస్తున్న అటవీ హక్కుల చట్టం, మౌలిక సదుపాయాల కల్పన అమలు జరగక, వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి సుమారు 15 నుంచి 20ఏళ్ల జీవనం సాగిస్తున్న గిరిజనులకు దగ్గరలో గల పంచాయతీల్లో విలీనం చేయడానికి స్థానిక పంచాయతీ పెద్దలు రాజకీయ నాయకులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని గిరిజనులను ఆయా గ్రామపంచాయతీలో ఓటర్లుగా నమోదు చేసి విలీనం చేసుకుంటే గిరిజనులకు రాజకీయ పదవులు రిజర్వేషన్లు అమలు అవుతాయని భయంతో గిరిజనులను పంచాయతీల్లో విలీనం చేయక ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఐ అనుబంధ సంఘం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తాడంగి ఎండుదొర ఎస్టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డి వి జి శంకర్రావు కి పలు డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. గురువారం బొబ్బిలి మండలంలో దొంగురు వలస గ్రామంలో రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకర్రావు సంబంధిత శాఖల అధికారులతో తాసిల్దార్ డోల రాజేశ్వరరావు అధ్యక్షతన రెవిన్యూ డివిజనల్ అధికారి సాయి శ్రీ, వైద్యశాఖ విద్యుత్, ఐసిడిఎస్, రహదారి భవనాల శాఖ, అటవీశాఖ తదితర శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి గిరిజన గ్రామాల ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సిపిఐ కార్మిక అనుబంధ సంఘం ఏపీ గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండు దొర మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజనుడికి మూడెకరాలు ఉండే ఐదు ఎకరాల వరకు పట్టాల మంజూరు చేయాలని. జిల్లాలో ఉన్న గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించి. విద్య వైద్యం విద్యుత్తు రోడ్లు ఏర్పాటుచేయాలని. అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని. బొబ్బిలి మండల పరిధిలో ఉన్నటువంటి కృపావలస. రామన్నవలస దీవెన వలస. సీయోనువలస. చిన అక్కేనవలస. గ్రామాలను దగ్గరలో ఉండే పంచాయతీలకు ఆయా గ్రామ రెవెన్యూ పరిధిలోకి చేర్పించాలని. అలాగే సిహెచ్ బొడ్డవలస పంచాయతీలో రోడ్లు.తాగునీరు లేని గిరిజన గ్రామాలు అయినటువంటి నిమ్మలపాడు. కోయకొండ వలస. చిల్లువలస. కాముపలస. ఈశ్వర బాయివలస. తదితర గిరిజన గ్రామాలకు రోడ్లు మంచినీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత మండల అభివృద్ధి అధికారులకు సంబంధిత తాసిల్దారు వారికి అనేకసార్లు వినతి పత్రాలు అందించి సంబంధిత శాఖ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బొబ్బిలి మండలం దొంగురు వలస ప్రాంతంలో ఉన్న వందలాది ఎకరాల ఫారెస్ట్ మరియు డి పట్టా భూములను బొబ్బిలి పట్టణానికి చెందిన కొందరు వెలమదొరలు. డాక్టర్లు. పెత్తందారులు అన్యాయంగా ఆక్రమించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. సిపిఐ బొబ్బిలి పట్టణ కార్యదర్శి ఎం శ్రీనివాస్ సిపిఐ మండల నాయకులు సిహెచ్ లచ్చన్న. సీతయ్య తమ్మయ్య. రాజు. చిరంజీవి, రాజు, గిరిజన జేఏసీ నాయకులు తుమ్మి అప్పలరాజు దొర, రైతు కూలీ సంఘం నాయకులు డి వర్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో మూడు మూగ జీవాలకు తీవ్రగాయాలు

-ప్రాణాంతకంగా పశువుల పరిస్థితి -ఆందోళనలో బాధిత రైతులు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో శ్రీదుర్గాలమ్మ గుడి సమీపంలో బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో మూడు మూగజీవాలకు తీవ్రగా యాలు కాగా వాటి పరిస్థితి ప్రాణాంతకంగా ఉంది. గ్రామానికి చెందిన కండిపల్లి దేముడుకు చెందిన రూ. 80వేలు విలువ చేసే పాడి గేదె, నెలల వయసుగల పెయ్యతో పాటు యుక్తవయసు గల పడ్డ కూడా అగ్నిప్రమాదంలో తీవ్రగాయాల పాలయ్యాయి. అలాగే పశువుల పాక, గడ్డి వాము కూడా కాలిపోయాయి. అలాగే గొర్లె అప్పారావుకు చెందిన పశువుల పాక, గడ్డి వాము కూడా కాలిపోవడంతో సుమారు లక్షా 50వేల ఆస్తినష్టం జరిగివుంటుందని రెవిన్యూ అధికారులు అంచనా వేసినట్లు తెలిసింది. కాగా పశువైద్యాధికారి కాలిపోయిన తీవ్రగాయాలు పాలైన పశువులకు వైద్యం చేస్తున్నట్లు బాధిత రైతులు తెలిపారు.

అంగన్వాడీల నిరసన ర్యాలీ

విశాలాంధ్ర-పార్వతీపురం/ గుమ్మలక్ష్మీ పురం: గుమ్మలక్ష్మీపురం కేంద్రంలో గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి రోడ్డు మార్గాన ఎల్విన్ పేట జంక్షన్ వరకు అంగన్వాడీలు నిరసన ర్యాలీ చేసి, ఎల్విన్ పేట జంక్షన్ దగ్గర బైఠాయించి, ముడుకులపై కూర్చొని ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడి సిఐటియు నాయకులు మాట్లాడుతూ వారి డిమాండ్లను తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి. మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్ గా మార్చాలి. మినీవర్కర్లకు ప్రమోషన్ ఇవ్వాలి. ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దుచేయాలి. అన్ని యాప్లు కలిపి ఒకే యాప్ గా మార్చాలి. లబ్దిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలి. ప్రీస్కూల్ బలోపేతం చేయాలి. నూతన జాతీయ విధానం 2020 ను రద్దుచేయాలి. సర్వీస్ లో ఉండి చనిపోయిన కుటుంబాలలో ఒకరికి ఉద్యోగ బీమా అమలుచేయాలి అని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వారి హక్కులను కల్పించాలని, వారి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని లేదంటే ఈ నిరసన మరింత ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మండంగి రమణ, కోలక అవినాష్, జనసేన అధ్యక్షులు మల్లేష్, బిడ్డిక మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవిఎం అవగాహన ప్రదర్శనను పరిశీలించిన ఆర్డీఓ



విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: మండలం లోని అడారు గ్రామంలో సంచార ఈవిఎం అవగాహన ప్రదర్శనను రెవిన్యూ డివిజనల్ అధికారి పార్వతీపురం నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి కె హేమలత గురువారం పరిశీలించారు. ఓటర్లుగా ఉన్న వ్యక్తులు ఈవిఎంల ద్వారా ఓటు వేసే విధానాన్ని తెలుసుకుంటూ ఓటు వేస్తున్నారు. అలాగే వేసిన ఓటు సక్రమంగా పడిందీ లేనిది పరిశీలిస్తున్నారు. ప్రదర్శనలో ఓటువేసిన అభ్యర్థులు తమ ఓటుపై సంతృప్తి చెందారు. బూత్‌స్థాయి అధికారి ఈవిఎం అవగాహన ప్రదర్శనను తెలియజేస్తూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ ఇవిఎంలపై స్పష్టమైన అవగాహనకు ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు ఓటును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి ఎల్ ఓ లు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుండి అంగన్వాడీ సమ్మె ఉధృతం



విశాలాంధ్ర-సీతంపేట: అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజులుగా ఐటిడిఏ అడవితల్లి ముఖద్వారం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యలను ఏపీ ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శాంతియుత నిరవధిక చేస్తున్న తరుణంలో గురువారం సీతంపేట మండల కేంద్రంలో కొన్ని అంగన్వాడీ కేంద్రాలను ఎంపీడీవో, వెలుగు అధికారుల ఆధ్వర్యంలో మహిళా పోలీసులు, వాలంటీర్లు అంగన్వాడీ కేంద్రాలు తాళాలను బద్దలు కొట్టడం హేయమైన చర్యని తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే ఈ విధంగా భయభ్రాంతులకు గురిచేయడం అంగన్వాడి కార్యకర్తలు మనోభావాలు దెబ్బ తీయడం అని ఏపీ అంగన్వాడీ సీనియర్ కార్యకర్త పార్వతి తెలిపారు. నేటి నుండి సమ్మె ఉధృతం చేయడం జరుగుతుందని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించినట్లయితే సమ్మె విరమించుతామని తెలిపారు. కార్యక్రమంలో సిటూ మండల కార్యదర్శి కాంతారావు అంజలి కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహనిర్మాణంలో ఉత్తమ జిల్లాగా పార్వతీపురం మన్యం

విశాలాంధ్ర-పార్వతీపురం: పేదలందరికీ ఇళ్లనిర్మాణంలో పార్వతీపురం మన్యం జిల్లా ఉత్తమ జిల్లాగా నిలిచిందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా కె.యస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ గృహ నిర్మాణం గూర్చి వివరిస్తూ పార్వతీపురం మన్యం జిల్లా గృహ నిర్మాణంలో మొదటి నుండి ఉత్తమ జిల్లాగా కొనసాగుతుందన్నారు. ప్రధాన మంత్రి జన్ మాన్ (జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకం క్రింద పివిటిజిలకు ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇళ్ళు లేకుండా ఉన్న వారిని గుర్తించి ప్రతిపాదనలను డిసెంబరు 15నుండి సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. రూ.2.39 లక్షల యూనిట్ ఖరీదుతో గృహాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా కె యస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ గృహనిర్మాణం వేగవంతం చేయాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా చేయాలని ఆదేశించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకట రావు, కె ఆర్ ఆర్ సి ఎస్డిసి జి కేశవ నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎంవిఆర్ కృష్ణాజి, గృహ నిర్మాణ సంస్థ ఇన్ ఛార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి రమేష్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి సన్యాసి నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజకుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామజిక తనిఖీ

పలు పంచాయతీలలో అక్రమాలు బట్టబయలు

విశాలాంధ్ర:-సాలూరు రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఓ గొల్లపల్లి. పార్వతి ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై 17 వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2022-2023 ఆర్థికసంవత్సరం లో మండలంలో 29 పంచాయతీలలో 19.55 కోట్ల రూపాయలతో జరిగిన ఉపాధిహామీ పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన 9 మంది డిఆర్‌పిలు పంచాయతీల వారీగా వివరాలను ప్రజావేదికలో ఉన్నతాధికారుల దృష్టి కి తీసుకువచ్చారు.పంచాయతీల వారీగా డిఆర్పీలు పనుల వివరాలను,ఖర్చుయిన మొత్తాన్ని ఉన్నతాధికారుకు చదివి వినిపించారు.డిఆర్పీలు వెల్లడించిన వివరాలను ద్వామా పిడి కె.రామచంద్రరావు, స్టేట్ రిసోర్స్ పర్సన్ తిరుపతిరావు లు నమోదు చేసుకున్నారు. సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించి గుర్తించిన అవకతవకలపై చర్చించారు.పెదపదం పంచాయతీ లో కందుల గంగులు అనే ఉపాధి కూలీ మృతి చెందినప్పటికీ గంగులు పేరున వేతనం డ్రా చేశారని అలాగే పురోహితునివలస పంచాయతీ లో కూడా మృతిచెందిన కూలీల పేర్ల పై వేతనాలు డ్రా చేశారని డిఆర్పీలు ప్రజా వేదికలో వెల్లడించారు.దాదాపు ప్రతీ పంచాయతీలో వాలంటీర్లకు ఆరు రోజులు పనికల్పించారు, విఓఏ లకు కూడా ఉపాధి వేతనాలు చెల్లించారు.ఇవి నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. నిబంధనలు ప్రకారం వాలంటీర్లకు మూడు రోజులు మాత్రమే పనికల్పించాల్సి ఉండగా ఆరు రోజులు కల్పించారని ఉన్నతాధి కారుల దృష్టికి డిఆర్‌పిలు తీసుకువచ్చారు. సంతకాలు,వేలిముద్రలు లేకుండా బిల్లులు చెల్లింపులు జరిగాయని తెలిపారు.చెరువు పనులలో తక్కువ విస్తీర్ణం లో చేసిన పనిని ఎక్కువగా చూపడం, కొలతలలో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. మస్టర్లలో, రికార్డులలో వివరాలు సరిగా నమోదు చేయలేదన్నారు.ఎక్కువ మొక్కలు నాటి నట్లు రికార్డులలో నమోదుచేయగా క్షేత్ర స్థాయిలో తక్కువ మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. మావుడి పంచాయతీ లో ప్రహరీ గోడ నిర్మాణం లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారన్నారు. గోడకు ప్లాస్టింగ్ జరగకుండానే పూర్తి బిల్లు ఎలా చెల్లించారని టెక్నికల్ అసిస్టెంట్ ప్రమీలను పిడి రామచంద్రరావు ప్రశ్నించారు.కొఠియా గ్రామాలలో ఉపాధి వేతనదారులకు ఒడిషా,ఆంధ్ర ఆధార్‌కార్డులు ఉన్నందున బిల్లులు చెల్లింపులకు ఆటంకం కలుగుతుందని పిడి రామచంద్రరావు తెలిపారు.ఈ కార్యక్రమం లో వీరితో పాటు వైస్ ఎంపిపి రెడ్డి సురేష్,ఎపిఓ రామకృష్ణ, సత్యనారాయణ, పలుగ్రామల సర్పంచ్ లు,ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

నిలిపి వేసిన రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ ను తిరిగి కొనసాగించాలి

సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం: ఇటీవల ఎంతోమంది ప్రయాణికులు ప్రయాణిస్తున్న రాయగఢ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ ను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరల పునఃప్రారంభించాలని పార్వతీపురం మన్యం జిల్లా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కన్వీనర్ పి.సంగం డిమాండ్ చేశారు. ఈమేరకు పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్ సూపరిం టెండెంట్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయగఢ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ ను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరలా పునః ప్రారంభించాలని అలాగే విశాఖ-రాయపూర్ పాసింజర్ రైలు 3.45కు, బయలుదేరి పార్వతీపురానికి ఉదయం 7.00 గంటల సమయానికి వచ్చేది దీనివలన ఉద్యోగస్తులు, విద్యార్థులు, చిరు వ్యాపారస్థులు, ప్రయాణికులకు అనువుగా చాలా సులభతరంగా ఉండేదని అయితే నేడు పాసింజర్ సమయం మార్చడం వల్ల ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆటో నాయకులు బొత్స కుమార్, బత్తుల కృపారావు, పిట్ట ఆదినారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగి ఆత్మహత్య...

విశాలాంధ్ర-కురుపాం: స్థానిక శోభలతాదేవి కోలనీలో నివాసం ఉంటున్న ఎస్.కోట సబ్ ట్రెజరీ ఉద్యోగి గూడేపు. రాజశేఖర్(33) గురు వారం ఉదయం ఇంట్లోఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న భార్య కుటుంబీకులు కురుపాం సామాజిక ఆరోగ్య కేం ద్రం నకు తరలించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు చెప్పారు. కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య భర్తల మధ్య తరుచూ గొడవలు కారణం గా మనస్తాపానికి గురై ఆత్మహత్య కు పాల్పడినట్లు బంధువు లు తెలిపారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

విశాలాంధ్ర- పార్వతీ పురం/ గుమ్మలక్ష్మీ పురం: గుమ్మలక్ష్మీ పురం మండలం కేదారిపురం పురం కాలనీ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బిడ్డిక సీత అనే విద్యార్థిని జ్వరంతో బాధపడుతూ గురువారం మృతిచెందింది. విద్యార్థిని స్వగ్రామం మండలంలోని పుట్టగూడ గ్రామం. విద్యార్థిని గురువారం ఉదయం బాత్రూంకి వెళ్లిన సమయంలో స్పృహ తప్పి పడిపోయిందని, దీనిని గుర్తించిన సంబం ధిత సిబ్బంది వెంటనే తాడికొండ పీహెచ్‌సికి తరలించారు. అయితే విద్యార్థిని మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గిరిజన విద్యార్థిని మృతికి కారణాలపై దర్యాప్తు చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా నాయకులు పల్లా సురేష్ డిమాండ్ చేశారు

నేడు పార్వతీపురంలో జాబ్ మేళా

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నేడు పార్వతీపురం పట్టణంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు. సాయి కుమార్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అద్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పార్వతీపురంలో గాయత్రి డిగ్రీ కాలేజీ లో ఈ నెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాబ్ మేళాలో 16 కంపెనీల ప్రతినిధులు ఐటి, ఫార్మా, హెల్త్, బ్యాంకింగ్, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, కంపెనీ ల ప్రతినిధులు హాజరవుతున్నారని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ , బి.టెక్, ఎంబీఏ చదివిన అభ్యర్థులు అర్హులు అని వారు తమ వివరాలను స్కిల్ యూనివర్స్ ఏపీఎస్ఎస్డిసి వెబ్‌సైట్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

పూర్ణపాడు-లాబేసు వంతెన కు మోక్షం ఎప్పుడు..? : సీపీఐ

విశాలాంధ్ర-కురుపాం/కొమరాడ: కురుపాం నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యగా మిగిలిన పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తికి మోక్షం ఎప్పుడోనని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ ప్రశ్నించారు. గురువారం వంతెన నిర్మాణ స్థలానికి వెళ్లి అర్థాంతరంగా నిలిచిపోయిన దాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఊకదంపుడు ప్రకటన తప్ప నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం వలనే నిర్మాణపనులు ముందుకు సాగటం లేదని అన్నారు. కనీసం ఎన్నికల ముందైనా పనులు పూర్తిచేసే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్శనలో సిపిఐ నాయకులు జి సూరయ్యపువ్వుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్

పల్లెనిద్రలో మండల పార్టీ అధ్యక్షుడు జగ్గుబాబు

విశాలాంధ్ర-వేపాడ: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైయస్ జగన్‌కే దక్కుతుందని మండల పార్టీ అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గిబాబు అన్నారు. మండలంలోని పాటూరు సచివాలయం పరిధిలోని ఓబలయ్యపాలెం గ్రామంలో నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం గ్రామంలో గ్రామ సర్పంచ్ దివదారి లక్ష్మి ఏర్పాటు చేసిన అల్పాహార విందు అనంతరం గ్రామంలో వైసీపీ నాయకులంతా ఇంటింటికి తిరిగి మళ్ళీ ముఖ్యమంత్రిగా జగన్ ను ఎందుకు గెలిపించుకోవాలో ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు జగ్గిబాబు మాట్లాడుతూ నిరుపేదలందరికి గృహవసతి కల్పించేందుకు ఉచితంగా ఇళ్లస్థలపట్టాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లులు కూడా మంజూరు చేసిన ఘనత ఒక్క జగన్ కే దక్కిందన్నారు. అలాగే పాటూరు,ఓబలయ్యపాలెం ముకుందపురం గ్రామాలకు ఈ నాలుగున్నరేళ్లలో సుమారు 27కోట్లకు పైగా సంక్షేమ పథకాలు అందించిన గొప్ప ముఖ్యమంత్రి జగనన్నారు. రైతుభరోసా కేంద్రాలు సచివాలయాలు,వెల్నెస్ కేంద్రాల ద్వారా ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చిన జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించుకోకపోతే వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలన్నీ రద్దుచేసే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జోన్ల ఇన్చార్జి మెరపల సత్యనారాయణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నిరుజోగి వెంకటరావు, మండల పార్టీ యువజన అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను,అరిగిపాలెం ఎంపీటీసీ తాండవరపు వెంకటరమణ, సర్పంచులు నాగిరెడ్డి కనకరాజు, మురిపిండి గంగరాజు,వైసిపి నాయకులు దివదారి శేఖర్, దుల్ల మహేష్, నిరుజోగి శ్రీనివాస్, పావాడ భాస్కర రావు (లాయర్),బి. ముత్యాలు,ఎం. మహేష్,చుక్కా భాస్కరరావు, తొండవరపు మల్లేశ్వర రావు,శిరికి సత్యనారాయణ, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు అండగా నిలిచిన టీడీపీ నేతలు

మాజీ ఎమ్మెల్యే కోళ్ల రూ.5 వేలు అందజేత

టీడీపీ యువనేత గొంప కృష్ణ 15వేలు వితరణ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట అగ్నిబాధితులకు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు అండగా నిలిచారు. మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గురువారం ఉదయం గ్రామానికి విచ్చేసి బాధితులను పరామర్శించి కండిపల్లి దేముడుకు తమ వంతు సాయంగా రూ.5వేలు అందించారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గం టీడీపీ యువనేత గొంప కృష్ణ కండిపల్లి దేముడుకు రూ.12వేలు, గొర్లె అప్పారావుకు రూ 3వేలు చొప్పున మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు, నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, గొర్లె నాగరాజుల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, పార్టీ కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి,మాజీ ఎంపీపీ దానరి లక్ష్మి, నాయకులు బోజంకి మహేష్, గోకేడ మద్దాలునాయుడు, నాగభూషణం,కోన సత్యం, జొన్నపల్లి రమణ, నాగిరెడ్డి ముత్యాలనాయుడు, కొటాన అప్పలనాయుడు, బాధిత కుటుంబాలు పాల్గొన్నాయి.

ఈవిఎం అవగాహన ప్రదర్శనను పరిశీలించిన ఆర్డిఓ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలం అడారు గ్రామంలో సంచార ఇవిఎం అవగాహన ప్రదర్శనను రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు పార్వతీపురం నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి కె హేమలత గురువారం పరిశీలించారు. ఓటర్లుగా ఉన్న వ్యక్తులు ఇవిఎంల ద్వారా ఓటు వేసే విధానాన్ని తెలుసుకుంటూ ఓటును వేస్తున్నారు. వేసిన ఓటు సక్రమంగా పడిందీ లేనిది పరిశీలిస్తున్నారు. ప్రదర్శనలో ఓటు వేసిన అభ్యర్థులు తమ ఓటుపై సంతృప్తి చెందారు. బూత్ స్థాయి అధికారి ఇవిఎం అవగాహన ప్రదర్శనను తెలియజేస్తూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ ఇవిఎంలపై స్పష్టమైన అవగాహనకు ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. ఇవిఎం పై సందేహాలు ఉంటే ఇప్పుడే నివృత్తి చేసుకోవచ్చని తద్వారా పోలింగ్ సమయంలో ప్రశాంతంగా, సజావుగా ఓటు వేయవచ్చని సూచించారు. ఓటుహక్కు కలిగిన ప్రతీ ఒక్కరు ఓటును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జాతి నిర్మాణంలో ఓటు హక్కు వినియోగించుకోవడం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందని ఆమె చెప్పారు.

అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కరించాలి

విశాలాంధ్ర-బెలగాం: అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పార్వతీపురం ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు అలివేలు, గౌరీమణి ఆధ్వర్యంలో మూడవ రోజుకు చేరిన నిరవధిక సమ్మెకు సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ, బివి రమణ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు బంటు దాసు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని యాప్‌ల పేరుతో ఉన్న పని భారాన్ని తగ్గించాలని వారి న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె ను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం అధికారులచే చేస్తున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె విరమించుకోమని అంగన్వాడీలు కలెక్టర్ కార్యాలయం ఆవరణలోనే ఆహారం తీసుకుంటూ నిరశన తెలుపుతున్నారు. సమ్మెలో అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

జనసేన నేత లోకం మాధవి

విశాలాంధ్ర-భోగాపురం: నెల్లిమర్ల నియోజక వర్గ అభివృద్ధే తమ లక్ష్యమని జనసేన నాయకులు లోకం ప్రసాద్,లోకం మాధవి తెలిపారు. గురువారం భోగాపురంలో మీడియా సమావేశం లో వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో కృషి చేస్తున్నా మనీ,అయితే ఇప్పటికే ఈ ప్రాంతం అభివృద్ధి కి దూరంగానే వుందన్నారు. భోగాపురం లో ఇండస్ట్రీయల్ పార్క్ తీసుకురావాలన్నది తమ ఆకాంక్ష గా తెలిపారు. అన్నిరంగాల్లో నెల్లిమర్ల నియోజక.వర్గం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ముందుగా లోకం మాధవి మాట్లాడుతూ ఇప్పటివరకు పాలకులు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని తెలిపారు. ఉత్తరాంధ్ర లోనే నెల్లిమర్ల నియోజకవర్గం అభివృద్ధి కేంద్రం గా మారాలన్నదే తమ ఆకాంక్షని తెలిపారు. ప్రాజెక్ట్ లపై నాయకులకు చిత్తశుద్ధి లేదన్నారు. మత్స్యకారులు వలసలు వెళుతున్న పరిస్థితి వుందన్నారు. మత్స్య సంపద నిలవచేసేందుకు కోల్డ్ స్టోరేజ్ లు కూడా లేకపోవడంతో మత్స్యకారులు నష్టపోతున్నారన్నారు.ప్రజలకు ఉపయోగ పడాలనే రాజకీయాల్లోకి వచ్చామని,పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధి తో పనిచేస్తున్నారన్నారు. మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో కృషి చేస్తూ ఎంతో మందికి ఉపాధి కల్పించామని చెప్పారు.అయితే ఈ ప్రాంతం పాలకుల వైఖరి వల్ల అభివృద్ధికి నోచుకోలేదన్నారు.లోకం ప్రసాద్ మాట్లాడుతూ వర్తమాన రాజకీయాల్లో నాయకులు గమ్యం లేని ప్రయాణం చేస్తున్నారన్నారు.నెల్లిమర్ల నియోజక వర్గంలో భౌగోళికంగా ఎన్నో వనరులున్నాయన్నారు. ఇక్కడి యువతకు, మహిళలకు, రైతాంగానికి,మత్స్యకారుల వున్నతికి అవసరమైన ప్రణాళికలు తమ వద్ద వున్నాయన్నారు. ఐటి రంగం మరింత అభివృద్ధి జరగాల్సిన అవసరం వుందన్నారు.విజయనగరాన్ని మెట్రో నగరంగా చేయాలన్నది తమ ఆకాంక్ష గా పేర్కొన్నారు. సంపదను సృష్టించి ఆ సంపదను పేదలకు చేర్చాలన్నది తమ లక్ష్యంగా తెలిపారు. హైదరాబాద్ లో 2.5లక్షల కోట్ల ఐటి రెవెన్యూ వుందని,10లక్షలమంది ఐటి రంగంలో పని చేస్తున్నారన్నారు.విజయనగరం జిల్లా లో కనీసం లక్ష ఉద్యోగాలు కల్పించాలన్న తమ ఆకాంక్ష నెరవేరేందుకు ప్రణాళికలు వున్నారన్నారు.తీర ప్రాంతంలో రెండు ఐటి పార్కు లు రావాలన్నారు.టీడీపీ జనసేన ప్రభుత్వ హయాంలో వంద కంపెనీలు నెలకొల్పడంతో పాటు ఐదు వేల ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.కేవలం ఐటి రంగంలో అభివృద్ధి సాధించాలన్నది తమయోచన కాదని తీర ప్రాంత ప్రజలంతా వ్యవసాయం మీద ఆధారపడి వున్నారనీ ,రైతుకు నెలకు పదివేలు ఆదాయం వచ్చేలా చేసే దిశగా ప్రయత్నం సాగుతుందన్నారు.మహిళలకు ఉపాధి కల్పన,ఉద్యాన వన పంట్లో ఆధునిక పద్ధతులతో మంచి ఫలసాయం సాధించాల్సి వుందన్నారు.ఇందుకు నర్సరీలను అభివృద్ధి చేయాల్సి వుందన్నారు. పరిశ్రమలు వ్యవసాయం అనుసంధానం కావాల్సి వుందని లోకం ప్రసాద్ తెలిపారు .ఒలింపిక్ స్థాయి ప్రతిభావంతమైన క్రీడాకారులున్నా వారికి ఎటువంటి సౌకర్యాలు లేవన్నారు.

ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి

36 గంటల ధర్నాలో ఆశాల డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం : ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 36గంటల పాటు కలెక్టరేట్ దగ్గర ధర్నా కార్యక్రమాన్ని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం. శివాని, కె. గౌరీశ్వరి, కె. నిర్మల, లక్ష్మి, గౌరీశ్వరి, పద్మ, త్రివేణి, అంజలి, సుకన్య, భాగ్యలక్ష్మిల ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ధరలు 500% పెరిగాయని, జీతాలు మాత్రం పెరగలేదని విమర్శించారు. అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, అందుకు జగన్ వేసే అదనపు పన్నులే కారణమని తెలిపారు. ప్రాణాలకు తెగించి కోవిడ్ కాలంలో పనిచేసిన ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించకుండా జగన్ ప్రభుత్వం శ్రమదోపిడి చేస్తుందని, తక్షణం ప్రతి ఆశా కార్యకర్తకు 26,000 కనీస వేతనం అమలు చేయాలని, 10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆన్లైన్ పేరుతో వేధింపులు ఆపి, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా ఆశాలను పరిగణించి సంక్షేమ పథకాలనుండి దూరంపెడుతూ, వేతనాలు చెల్లించేటప్పుడు ఆశాలను గౌరవవేతనం పేరుతో పీఆర్సీ అమలు కాకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రెండు నాల్కల ధోరణితో వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. తక్షణం ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పీఆర్సీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలుచేయాలని, చనిపోయిన ఆశా కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు ఆశలకు వర్తింపచేయలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. ఇందిరా కోశాధికారి జి. వెంకటరమణ పట్టణ పౌర సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు టిడిపి సీనియర్ నాయకులు మాజి శాసన సభ్యులు బొబ్బిలి చిరంజీవులు, జనసేన పార్టీ నాయకులు మద్దతు తెలిపారు

శ్రీలక్ష్మినరసింహస్వామి ముడుపుల పూజలకు విశేష ఆదరణ

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలోని సీతా నగరంలో సువర్ణముఖి నదికి ప్రక్కనే ఉన్న శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ప్రతీ గురువారం జరుగుతున్న ముడుపుల పూజలకు భక్తుల నుండి విశేష ఆదరణ లభిస్తుంది. వివిధ ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున ఇక్కడకు భక్తులు తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తెల్లవారుజామున నుండి సాయత్రం వరకు స్వామివారికి ఆలయఅర్చకులు పూనపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజా చార్యులు ఆధ్వర్యంలో పూజలను నిర్వహిస్తున్నారు. ప్రతీ గురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలో జరుగుతున్న ఈ ముడుపుల పూజలకు వారం వారం భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో అర్చకులు బ్యాచుల వారీగా పూజలు చేస్తున్నారు. స్వామివారిని అన్ని రకాల పూలతో అలంకరించి పూజల చేయడం జరుగుతుంది. ముడుపులు పూజలకు వారం వారం భక్తులనుండి అనూహ్య స్పందన లభిస్తోందని స్థానికులు తెలిపారు. వివిధ ప్రాంతాలనుండి భక్తజనం విచ్చేసి ఉపవాసం ఉండి భక్తి శ్రద్ధలతో పూజలను చేసి స్వామివారిని దర్శించుకుని, గోవింద గోవింద అంటూ ప్రదక్షిణలు చేసి స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. కార్తీకమాసం ముగిసిన శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలో భక్తుల తాకిడి తగ్గలేదు. ఆదివారం నుండి ఇదే ప్రాంగణంలో ఉన్న శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్చకులు తెలిపారు. గోవిందమాల దరించి జనవరి నెల 14వరకు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని భక్తులు తెలిపారు.

ఓటుతో భవిష్యత్తు మార్పు : టిడిపి నాయకురాలు భూదేవి

విశాలాంధ్ర-సీతంపేట: రాష్ట్రంలో మూడు నెలలలో రాబోతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వేసే ఓటుతో ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు మారబోతుందని టిడిపి నాయకులు పడాల భూదేవి ఉద్ఘాటించారు. గురువారం సీతంపేట క్యాంపు కార్యాలయంలో టిడిపి కార్యకర్తలతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్ళుగా ప్రజలు వైసిపి పాలనపై విసుగు చెంది టిడిపి - సేనా పాలన ఎప్పుడు వస్తుందా... పేద ప్రజల బతుకులు ఎప్పుడు మార్పు వస్తుందా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో ఎటువంటి కుట్ర జరగకుండా, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితా ను ఏజెంట్లు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. బూత్‌స్థాయిలో కట్టుదిట్టంగా పనిచేయాలని సూచించారు. ఇప్పటికే టచ్‌లో ఉన్న ఇతర పార్టీల కార్యకర్తలను పార్టీలోకి అహ్వానించే పనిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, సవర కుంపి, సవర మల్లేష్, కూర్మారావు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల పట్ల వైసీపీ నేతల వ్యాఖ్యలు సిగ్గుచేటు

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు పలికిన టిడిపి నేతలు అమర్‌నాథ్ రెడ్డి, నాగార్జున

విశాలాంధ్ర-గరివిడి : మహిళలని చూడకుండా అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేతల తీరు దారుణమని టిడిపి నేతలు అమర్నాథరెడ్డి, కిమిడి నాగార్జున అన్నారు. వయసు, హోదా మరిచి బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అంగన్‌వాడీలు ఒళ్లు కొవ్వెక్కి సమ్మె చేస్తున్నారని అనడం హేయమైన చర్యన్నారు. వైసీపీ నేతలే ఒళ్లు బలిసి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు మూడో రోజు గరివిడిలో చేపట్టిన సమ్మెకు తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దతు పలికారు. గురువారం గరివిడి పట్టణంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో జగన్ ఇచ్చిన హామీలనే అమలుచేయాలని కోరుతున్నారని గుర్తుచేశారు. వారి ఆందోళనను అర్థంచేసుకోవాల్సింది పోయి, అణగదొక్కే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాగార్జున మాట్లాడుతూ అంగన్‌వాడీలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బొబ్బిలి ఎమ్మెల్యే తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనపై సుమోటోగా పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కార్యకర్తలకు, సహాయకులకు తక్షణమే వేతనం పెంచాలని, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కల్పించాలని, గ్రాట్యుటీ, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ అండగా నిలిచిపోరాటాల్లో పాల్గొంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు అంబళ్ళ గౌరి నాయుడు, అంగన్వాడీ సంఘం నాయకులు రౌతు వరలక్ష్మి, రూపావతి, కృష్ణవేణి, సరళ, టిడిపి నాయకులు ముల్లు రమణ, అడపా సూర్యనారాయణ, రెడ్డి లక్ష్మణరావు, మీసాల కాశీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తక్షణమే క్షమాపణ చెప్పాలి : సిటూ



రామభద్రపురం :అంగన్వాడి కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు స్థానిక ఎమ్మెల్యే తక్షణమే వారికి క్షమాపణ చెప్పాలని సిఐటియు నాయకులు బల్సా శ్రీను డిమాండ్ చేశారు. గురువారము మండల కేంద్రంలో బొబ్బిలి, సాలూరు రోడ్డు పై జంక్షన్ వద్ద అంగన్వాడీలతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను ఎమ్మెల్యే పై పలు నినాదాలు చేశారు. అంగన్వాడి ల జోలికి ఎవరైనా వస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని అన్నారు. జీతాలు పెంచమని సమస్యలు పరిష్కరించమని సమ్మెలు చేస్తే ఎమ్మెల్యే వెంకట చినప్పల నాయుడు నోటికి వచ్చినట్టు మాట్లాడితే అంగన్వాడీలు పడరని అన్నారు. ఎమ్మెల్యే తక్షణమే వారి వద్దకు వచ్చి క్షమాపణ చెప్పాలని లేదంటే వచ్చే ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమని హెచ్చరించారు. కనీసం మహిళ అని చూడకుండా అగౌరవంగా మాట్లాడడం ఎంతవరకు సమంజ సమని ఎమ్మెల్యే ను ప్రశ్నించారు సమస్యల పరిష్కరించేంతవరకు సమ్మె జరుగుతూనే ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకులు సత్యవతి ,రాధా, లక్ష్మి అరుణ పాల్గొన్నారు.

నేటి సాయంత్రం 4 నుంచి డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శృంగవరపుకోట డిపో పరిసర ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా సూచించారు. ప్రయాణికులు డిపో మేనేజర్ : 9959225619, డిప్యూటీ సూపరింటెండెంట్ : 9490583579 నెంబర్లను సంప్రదించాలని డీఎం రమేష్ పేర్కొన్నారు.

యువగళం పాదయాత్ర విజయవంతం చేయాలి

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం

విశాలాంధ్ర-గజపతినగరం: యువ గళం పాద యాత్ర ముగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ గజపతినగరం పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువ గళం పాదయాత్ర నెలిమర్ల నియోజకవర్గంలో ఈనెల 20వ తేదీన పోలిపల్లి భారీ బహిరంగ సభతో ముగియనుంది ఈ భారీ సభలోని నియోజకవర్గంలోని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు సీనియర్ నాయకులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మహిళలు అభిమానులు ప్రతి ఒక్కరు వచ్చి పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అంగన్వాడీల అక్రందన

విశాలాంధ్ర-భోగాపురం: తమ డిమాండ్లను నెరవేర్చాలని భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ, మండలాల అంగన్వాడీ కార్యకర్తలు సిఐటియు ఆధ్వరంలో గురువారం భోగాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు 26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలన్నారు. వేతనంలో సగం మొత్తం పింఛనుగా ఇవ్వాలని, పదవి విరమణ సమయంలో 5లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీ సెంటర్లను ప్రధాన కేంద్రాలుగా గుర్తించడంతో పాటు పదోన్నతులు కల్పించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దుచేయాలని, ఇప్పటికే చాలీచాలని జీతాలతో నెట్టు కొస్తున్న మాకు ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న అద్దెలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మా కడుపు కొట్టి అంగన్వాడి సెంటర్లను వాలంటీర్లతో, సచివాలయ సిబ్బందితో నడిపి స్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలో ఒక ఎమ్మెల్యే పరిది దాటి ఇష్టమొచ్చినట్లు మాపై వ్యాఖ్యలు చేసారని ఆవేదన చెందుతూ ముఖ్యమంత్రి జగన్ ముందు తమ ఎమ్మెల్యేలకు మహిళలతో ఎలా మాట్లాడాలో నేర్పాలని అన్నారు. అధికారులు మమ్మల్ని మనుషులుగా గుర్తించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం మా న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని అన్నారు.

ఎమ్మెల్యే శంబంగి అరెస్టు చేయాలని

అంగన్వాడీల రాస్తారోకో

విశాలాంధ్ర- గజపతి నగరం: అంగన్వా డీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి లక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడీలు కార్యకర్తలు సహాయకులు గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు న్యాయమైన సమస్యలు పరిష్కరిం చాలని నిరసన చేపడుతున్న కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.

ఎరుకల సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గేదెల సత్తిబాబు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రముఖ విద్యావం తుడు, ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తి, జాతి అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నటువంటి సేవకుడిగా గుర్తింపు పొందినందుకుగాను రాష్ట్ర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎస్.కోట మండలం, పోతనాపల్లి గ్రామానికి చెందిన గేదెల సత్తిబాబుని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. సత్తిబాబు ఎన్నిక పట్ల విజయనగరం జిల్లా ఎరుకల కులస్తులు, స్థానిక ఎరుకల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోతనాపల్లి ఎరుకల సంఘ పెద్దలు పోతయ్య, త్రినాథ్ తదితరులు గురువారం మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికైన సత్తిబాబుకి రాజకీయ అవగాహన ఉందని, గడిచిన 10 సంవత్సరాల నుండి పోతనపల్లి గ్రామపంచాయతీ ఎన్నికలలో క్రియాశీలకంగా వ్యవహరించి తగు గుర్తింపు పొందడం వలన మాత్రమే రాష్ట్రస్థాయి పోస్టు ఇచ్చి ఉంటారని తెలియజేశారు. సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్ర నాయ కత్వం నాపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేయటంతో పాటు ఎరుకల జాతి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలియజేశారు.

సత్య కళాశాలలో ఇంధన సంరక్షణ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక తోట పాలెం లో గల సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఇంధన సంరక్షణ పై అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా సీతం ఇంజనీరింగ్ కళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డీన్ అయిన డాక్టర్ వై. నరేంద్ర కుమార్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంటు సంతోష్ విచ్చేశారు. కార్యక్రమంలో ఇంధన సంరక్షణ చట్టం 2001 ప్రకారం విద్యార్థులకు శక్తి వనరులు సద్వినియోగం మరియు పొదుపు పై అవగాహన కల్పించడం జరిగింది. భారత ప్రభుత్వం 1-3-2002 లో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిసియన్సీ యాక్ట్ ఏర్పాటు చేసిందని చెప్పారు. విద్యుత్ శక్తి వినియోగం, ఇంధన వనరుల పొదుపు, మొబైల్ ఫోన్ వినియోగం, ఎయిర్ కండిషన్ ఫ్రిడ్జ్ ల వినియోగం మొదలగు ఇంధన వనరుల అనవసర వినియోగం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇప్పుడు మనం ఇంధన వనరుల అనవసర వినియోగం తగ్గిస్తే మనదేశం లోనే ఇంధన వనరుల కొరతను నివారించ వచ్చు. వనరులు భవిష్యత్తులో ఉపయోగించుకోవడానికి మిగల్చవచ్చని తెలిపారు అనంతరం విద్యార్థులకు క్విజ్ ను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమం లో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎగువ కొత్త గూడ రహదారి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

విశాలాంధ్ర-కురుపాం: మండలంలో గుజ్జువాయి పంచాయతీలో జి.శివడ రోడ్డు నుండి వై.కొత్తగూడ వరకు నూతనంగా మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గిరిజన గ్రామానికి విద్య, వైద్య, రహదారి మౌలిక వసతులు కలపన లక్ష్యంగా పనిచే స్తుందని అందులో భాగంగా ఈ గ్రామానికి 1.20 కిలోమీటర్ల మేరకు రూ.85 లక్షలు నిధులతో బీటీ రహదారి పనులకు నిధులు మంజూరయ్యావని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు, ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు, ఎంపీటీసీలు సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దరమే ధ్యేయం :డిప్యూటీ స్పీకర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దరమే ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. గురువారం నగరంలోని 10వ డివిజన్ లో సుమారు 30 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన రహదారులు, కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బొండిలగూడెంలో 7.50 లక్షల రూపాయలతో పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాల్లో పర్యటించిన సందర్భంలో గుర్తించిన ప్రజావసరాలను తీర్చేదిశగా కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 20 లక్షల రూపాయలతో 10వ డివిజన్లో ని వివిధ ప్రాంతాలలో రహదారులు కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు.

ఏడున్నర లక్షల రూపాయలతో బొందిల గూడెంలో పార్కు నిర్మాణానికి పనులు ప్రారంభించామన్నారు. ఇలా ప్రజల సమస్యలు ఏవైనా తీర్చడమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కృషి చేస్తున్నారన్నారు. దీనివల్లనే నగరంలో అనేక చోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు అవకాశం ఏర్పడిందన్నారు. ప్రజల దాహార్తిని తీర్చే విధంగా అనేక ప్రాంతాలలో వాటర్ ట్యాంకులు నిర్మించి తద్వారా నీటి పంపిణీకి చొరవ చూపారన్నారు. నగరంలో ప్రధాన జంక్షలను అభివృద్ధి చేసి నగరాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు ఇదే స్పందనతో మరోసారి శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నాయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

20న యువగళం పాదయాత్ర, ముగింపు భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజలే సైకో ప్రభుత్వానికి బుద్ధి చెప్తారు

మాజీ మంత్రి అరకు, పార్లమెంట్ అధ్యక్షులు కిడారి

టీడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్

విశాలాంధ్ర-సాలూరు టౌన్: ప్రజాస్వామ్యాన్ని తుంగలోకి తొక్కి సైకో ఆలోచనలతో ఆంధ్రప్రదేశ్‌ని అతలాకుతం చేసింది. జగన్ ప్రభుత్వం అని టిడిపి మాజీ మంత్రి నూతన అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్ విమర్శించారు. గురువారం సాలూరు పట్టణం టిడిపి పార్టీ కార్యాలయంలో ఈ నారా లోకేష్ యువగళం పాదయాత్రపై టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు జి.సంధ్యారాణి అధ్యక్షతన టిడిపి, జనసేన మండల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్, మాజీ ఎమ్మెల్సీ విశ్వ ప్రసాద్ పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య అత్యధిక ఉందని సంక్షేమ ఫలాలను పంచడమే తప్పించి ఈ రాష్ట్రానికి ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదని అందుకోసమే యువగళం పాదయాత్రను చేపట్టారు అని అన్నారు. ఈ పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజలు యువత మద్దతు పలికి నారా లోకేష్ వెన్నంటే ఉండి నడిపిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్దేశించి ఈనెల డిసెంబర్ 20న నారా లోకేష్ పాదయాత్ర ముగింపు దశ భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో జరుగుతుందని తెలిపారు. ఈ సభ ఎన్నికల ముందు జరుగుతుందని అందుకోసం భారీ బహిరంగ సభను నిరసిస్తున్నాం. ఈ సమావేశానికి టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, పెద్ద ఎత్తున నాయకులందరూ హాజరు అవుతున్నారని వివరించారు.ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు జడ్పిటిసిలు ఎంపీటీసీలు మరియు ఐదు లక్షల మంది వరకు ఈ సభకు హాజరవుతున్నారని తెలియజేశారు. లోకేష్ పాదయాత్రను ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే సైకో జగన్ వారవలేకపోతున్నారని అందుకు నిదర్శనంగా పాదయాత్రను ఆపాలని వారిపై అవినీతి ఆరోపణలు చేసేందుకు చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయించి నానా ఇబ్బందులు గురిచేశారని మండిపడ్డారు. వైకాపా చేస్తున్నది రౌడీ రాజకీయం,కక్షపూరిత, సైకో రాజకీయం చేస్తున్నది జగన్ అనే విమర్శించారు. ఈయన మీదకి ఏ నిందలు రాకూడదని వారి ఎమ్మెల్యేలపై నిందలు వేసి ఈయన పక్కకు తప్పుకుంటున్నారని ఈ విషయం హాస్యపదంగా ఉందని తెలిపారు. ఈ నాయకుడికి ప్రజాస్వామ్యాన్ని విలువలు కాపాడడం తెలియదు.వారికి కోర్టు తీర్పులు దిక్కరించి మరి రాజకీయం చేస్తున్నారని అన్నారు. మీ ప్రభుత్వం మరొక మూడు నెలల వారికే కొన సాగుతుందని తెలుగు దేశం జెండా ఎగురు తుందని నారా చంద్రబాబు నాయుడు

ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేస్తారని ఘంటాపదంగా తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మాజీ ఎమ్మెల్యే ఆర్.పి.భంజ్ దేవ్ మాట్లాడుతూ సైకో ఆలోచనలతో ఉన్న జగన్ను ఎవరు మార్చలేమని ఆయనకు బుద్ధి వచ్చే లా ఎన్నికల్లో ప్రజలు, నాయకులు చెబుతారని మరొక మూడు నెలల్లో ప్రభుత్వం మారుతుందని రానున్నది చంద్రన్న పాలన అని అన్నారు. నారా లోకేష్ యువగల పాదయాత్రకు నాయకులు కార్యకర్తలు అభిమానులు టిడిపి శ్రేణులు అందరూ పాల్గొని ఈ భారీ బహిరంగ సభను జయప్రదం చెయ్యాలని అన్నారు. కార్యక్రమంలో, మాజీ ఎమ్మెల్సీ విశ్వప్రసాద్,టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మ తిరుపతిరావు, పాచిపెంట మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్, ఆముదాల పరమేశ్వరరావు, గుల్లా వేణుగోపాలరావు, చలమూరి వెంకట్రావు, జనసేన రిషి వర్ధన్, మండల అధ్యక్షులు శివకృష్ణ,నవీన్,సాయి తదితరులు పాల్గొన్నారు.

నీతి, నిజాయితీగా పని చేస్తున్న ప్రభుత్వ సేవలను గుర్తించండి

ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : నీతి, నిజాయితీగా సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులు చేస్తున్న వైఎస్సార్సీపీ ప్రభుత్వ సేవలను గుర్తించాలని ప్రజలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. ఎస్.కోట మండలం, భర్తపురం ఎస్టీ కాలనీ (కిల్తంపాలెం) సచివాలయం పరిధిలో 291వ రోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం సాయంత్రం జరిగింది. ఇంటి ఇంటికి వెళ్లి పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలుపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రతి గడపలోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించటం, ఇంకా ఏమైనా సమస్యలు వుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటూ, నేరుగా ప్రజలతో కలసి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఇంకా మెరుగైన పరిపాలన సీఎం జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమౌతుందని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ముఖ్యమంత్రి పంపిన లేఖను అందజేసారు. నాలుగేళ్ళలో దేవుడి దయతో, మీ అందరి చల్లని చూపులతో మంచి చేసామని, ఇక ముందు కూడా మంచి చేస్తామని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు అధ్యక్షుడు మోపాడ కుమార్, మాజీ జెడ్పీటీసీ రామలక్ష్మి, పోతనపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, కేత వీరన్న, తలారి అనంత, కొట్టం చంద్రరావు, సీతంపేట చింతల నారాయణ మూర్తి, అప్పలసత్యం, నాగరాజు, వెంకటరమణపేట ఆవాల కృష్ణ, యలమంచిలి రాంబాబు, వార్డు సభ్యులు ఎడ్ల నాయుడు, అదారి రామ్మోహన రావు, గౌరీపురం కాంద్రేగుల నర్సింగరావు, వేములపల్లి రాము, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పోలమాంబ ఉత్సవంలో పాల్గొన్న సిరిసహస్ర

విశాలాంధ్ర - విజయనగరం : విజయ నగరం లంకా పట్నంలో జరుగుతున్న వద్దే పోలమాంబ అమ్మవారి ఉత్సవంలో జిల్లా పరిషత్ ఛైర్మన్, వైఎస్ఆర్సిపీ జిల్లా అధ్యక్షులు చిన్న శ్రీను కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర పాల్గొన్నారు. ఘతాలు ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని స్థానిక భక్తులతో కలిసి వద్దే పొలమాంబ అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక లంకాపట్నం ప్రజలు సిరి సహస్రకు సాదర స్వాగతం పలికారు జిల్లా ప్రజలకు సకల శుభాలు ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు కలగాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలొ స్థానిక మహిళలు పిల్లలు పలు దళిత సంఘాల నాయకులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉప అధ్యక్షులు తోట వాసు, సోము అప్పారావు, మజ్జి ప్రసాద్,శివ జగదీష్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులను ఆదుకొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : నియోజకవర్గంలో రెండు చోట్ల జరిగిన వరుస అగ్ని ప్రమాద ఘటనల మూలంగా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను గురువారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పరామర్శించి వారికి ప్రభుత్వ సహాయంతో పాటు తాను కొంత మొత్తంలో సహాయం అందించారు. వివరాల్లోకి వెళ్ళితే పురపాలక సంఘం, 10వ వార్డు పెద్ద మాదిగ వీధిలో గల భాదిత కుటుంభం కురమాన సురేష్ కుమార్ ఇంట షార్ట్ సర్క్యూట్ కారణంగా నిన్న సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదం ఘటనతో పాటు మొన్న సాయంత్రం నర్సిపురం గ్రామంలో గల బాధిత కుటుంబం మూఢడ్ల శ్రీరాములు ఇంట షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదం ఈ రెండు కుటుంబాలు సర్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగలగా విశయం తెలుసుకున్న ఎమ్మెల్యే అధికారులతో మాటలాడి ప్రమాద తీవ్రత తగ్గించడంతో పాటు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందేలా చూడాలని ఆదేశించి తన సొంత ఖర్చులతో సమకూర్చిన బియ్యం, వస్త్రాలు, డబ్బులతో పాటు ప్రభుత్వం తరపున ఒక్కో కుటుంబానికి 10 వేలు నిత్యావసర సరుకులు అంద చేయడంతో పాటు ఇల్లు పాడైన వాటి స్థానంలో కొత్త ఇల్లు మంజూరు చేయమని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శివన్నారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు జే దివ్య, ఎన్ సుధీర్, పిఎసి ఎస్ ఛైర్మన్ కే సత్యన్నారాయణ, పార్టీ జనరల్ సెక్రెటరీ వి గురు రాజు, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపీపీ బి రవి కుమార్, వైసీపీ సీనియర్ నాయకులు ముప్పల సత్యం నాయుడు, తెర్లి రామ స్వామి, రెడ్డి అప్పలనాయుడు, మండల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీమా డబ్బులు అందజేత

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రానికి చెందిన సుంకర వీధిక చెందిన సేపేన రమేశ్ సోమవారం రాత్రి అకాల మరణం చెందడం వలన వైయస్సార్ భీమా తరపున తక్షణ సహాయ ముగా 10,000 రూపాయలను ప్రభుత్వం నుంచి వెలుగు సిబ్బంది అందజేసారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గరికయ్య ఎంపీటీసీ కిరణ్,, వార్డు సభ్యులు రామారావు , రమేష్ఈఓ వెంకటరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విమానాశ్రయ పనులను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర - భోగాపురం : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ గురువారం సాయంత్రం పరిశీలించారు. మొత్తం 9 జోన్ల పరిధిలో విమానాశ్రయం, రన్ వే ప్రాంతం, వర్క్ షాప్, కాంక్రీట్ ప్లాంట్, పరిపాలనా భవనం, ట్రంపెట్ రహదారిని నిర్మించే ప్రాంతాలను సందర్శించారు. భూమిని చదును చేస్తున్న పనులను, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను, మ్యాప్ లను పరిశీలించారు. నిర్మాణ పనులు గురించి జీఎమ్మార్ అధికారులు రామరాజు, కోటేశ్వరరావు, ఎల్.అండ్ టి ప్రతినిధులు కలెక్టర్ కు వివరించారు. విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, రహదారుల నిర్మాణం గురించి కలెక్టర్ ఆరా తీశారు. రాత్రి పగలు పనులు జరుగుతున్నాయని, జనవరి నెలాఖరులోగా ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వివరించారు. ఈ పర్యటనలో ఆర్డీవో ఎం.వి.సూర్యకళ, తాసిల్దార్ సిహెచ్ బంగార్రాజు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మూల బొడ్డవరలో జగన్ ఎందుకు కావాలంటే

విశాలాంధ్ర - శృంగ వరపుకోట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం ఎస్.కోట మండలం, మూల బొడ్డవర సచివాలాయ పరిధిలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 28 కోట్ల 23లక్షల 76 వేల 448 రూపాయల (282376448/-) విలువగల లబ్ధిదారులు సంక్షేమ పథకాల పట్టిక బోర్డును ఎమ్మెల్యే కడుబండి ఆవిష్కరించారు. అనంతరం జగన్ మళ్లీ ఆంధ్రప్రదేశ్ కి ఎందుకు అవసరమో గృహసారధులు, గ్రామస్థులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు వివరించిన అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ వేచలపు చినరామునాయుడు, రాష్ట్ర ఫోక్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఎస్.కోట వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకట రమణ, మండల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్, పోతనపల్లి సర్పంచు కూనిరెడ్డి వెంకటరావు, కొట్టం చంద్రరావు, ఆవాల కృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే మానసిక ఒత్తిడిని జయించవొచ్చు : డా.సుభాష్

విశాలాంధ్ర - డెంకాద : లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పర్సనాలిటీ డెవలప్మెంట్ క్లాస్‌లలో భాగంగా ఒత్తిడి నిర్వహణపై మెడికల్ కాలేజ్ సైకాలజిస్ట్ డాక్టర్ సుభాష్ తో టాక్ ను నిర్వహించింది. ఈ సెషన్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒత్తిడి యొక్క మూల కారణాలను మరియు సమర్థవంతమైన కోపింగ్ మెకానిజమ్‌లను అర్థం చేసుకోవడంపై నిర్వహించబడినది. మనస్తత్వ శాస్త్రంలో నిపుణుడు డాక్టర్ సుభాష్, విద్యార్థులు వారి విద్యా మరియు వ్యక్తిగత జీవితంలో ఒత్తిడిని నిర్వహించడానికి అవసరమైన సాధనాలతో సాధికారత కల్పించడానికి డా.సుభాష్ ప్రసంగించి ఒత్తిడి యొక్క చిక్కులను, దానిని సమర్థవంతంగా ఎదుర్కోవటానికి ఆచరణాత్మక వ్యూహాలను అందించారు. ఇంటరాక్టివ్ సెషన్ లో విద్యార్థులు ప్రశ్నలు అడగడానికి మరియు మార్గనిర్దేశం చేయడానికి, వ్యక్తిగత పెరుగుదల మరియు శ్రేయస్సు కోసం అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.రామా రెడ్డి డాక్టర్ సుభాష్‌కు పుష్పగుచ్ఛం మరియు శాలువాను అందించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని పెంపొందించడంలో మరియు సానుకూల అభ్యాస వాతావరణాన్ని సృష్టించడంలో ఇటువంటి సెషన్‌ల ప్రాముఖ్యతను ప్రిన్సిపాల్ నొక్కి చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని మరియు స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ హెడ్ డాక్టర్ పి.దుర్గా శైలజ సెషన్‌లో పాల్గొన్నారు, విద్యార్థులకు వారి విద్యా పాఠ్యాంశాలకు మించి విభిన్న అభ్యాస అవకాశాలను అందించడానికి సంస్థ యొక్క సహకార ప్రయత్నాలను ఏ విధంగా చేస్తుందో తెలియ జేశారు.

గిరిజన విద్యార్థినీ విద్యార్థుల సమస్యల పరిష్కరించాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : గిరిజన విద్యార్థిని విద్యార్థులకు గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహం బొబ్బిలి పట్టణంలో ఏర్పాటుచేసి గిరిజన బాలికల కాలేజీ వసతి గృహానికి సొంత భవనం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అఖిల భారత విద్యార్థి సమైక్య జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ ఎస్టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డి వి జి శంకర్రావుకి గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో పట్టణం లో గిరిజన వసతి గృహం కు మౌలిక సదుపాయాలు కల్పించాలని. గిరిజన హాస్టల్ లో ఖాళీగా ఉన్నటువంటి కమాటి, నైట్ వాచ్మెన్, అటెండర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని. బొబ్బిలి పట్టణంలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని. పట్టణానికి దూరంగా ఉన్నటువంటి గిరిజన బాలికల కాలేజ్ హాస్టల్ కు సొంతభవన్ ఏర్పాటు చేయాలని. గిరిజన వసతి గృహాల్లో నెలకు రెండుసార్లు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎం.హరి,దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

విశాలాంధ్ర - బెలగాం : కిశోర బాలికల్లో రక్త హీనత నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన వైద్య సిబ్బందితో కలసి 18వ వార్డులో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ ను గురువారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలు తెలిపిన కొంతమంది విద్యార్థులకు వైద్య సిబ్బందిచే హీమోగ్లోబిన్ రక్త పరీక్షలు జరిపి, అవసరమైన మందులు అందజేశారు. పర్యవేక్షణ చేయాలని, విద్యార్థుల సిక్ రిజిష్టర్ పక్కగా నిర్వహించాలని హాస్టల్ వార్డెన్ కు సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు రక్తహీనత వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను విద్యార్థులకు వివరించారు. రక్త హీనత నివారణలో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, పౌష్టికాహారం ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. చర్మ వ్యాదులు రాకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమని, నీరు ఎక్కువగా త్రాగాలని సూచించారు. శీతాకాలంలో ప్రబలే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ఆయన కిచెన్, వాటి పరిసరాలను, ఆహార పదార్థాలను పరిశీలించారు. మూతలు ఉండేలా చూసుకోవాలని వంట సిబ్బంది ఎప్పటికప్పుడు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ పుష్ప, హాస్టల్ వార్డెన్ కె. కూర్మమ్మ, ఎఎన్ఎం రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

విశాలాంధ్ర - గజపతినగరం : రోగులకు మెరుగైన సేవలు అందించాలని గజపతి నగరం ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక అన్నారు గురు వారం గజపతినగరం మండలంలోని మరుపల్లి పిహెచ్సి కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు ఆరోగ్య సురక్షకు సిద్ధంగా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొవ్వాడ కిషోర్ కుమార్ పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణరెడ్డి సర్పంచ్ లంక రామలక్ష్మి పాల్గొన్నారు.

దివ్యాంగులను ఎంతో ఆదర్శంగా తీసుకోవాలి

మండల విద్యాశాఖ అధికారులు రాజకుమార్‌దాస్

విశాలాంధ్ర - సాలూరు టౌన్ : దివ్యాంగులు ఎంతో గొప్పవారు మనం వారిని గుర్తించి సేవలు అందించాలి అని మండల విద్యాశాఖ అధికారిలు రాజకుమార్,దాస్ కొనియాడారు. సాలూరు పట్టణం రామ కాలనీలో ఉన్న భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష, పార్వతీపురం మన్యం అదనపు కోఆర్డినేటర్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి మండల అధికారులు మాట్లాడుతూ దివ్యాంగులు ఈ సమాజంలో మనతో మనలా సమానంగా పెంచాలని వారిని గుర్తించి అవసరమైన వస్తువుల్ని వారికి సమకూర్చాలని తెలియ జేశారు. సమగ్ర శిక్ష దివ్యాంగుల పిల్లలకు ఎన్నో రకాల సేవలను అందిస్తూ వారిని ముందుకు తీసుకెళుతూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. కావున దివ్యాంగుల పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దేలా వారిని అందరికీ ఆదర్శంగా చూపించాలని సూచించారు. అనంతరం దివ్యాంగుల పిల్లలకు ఆటల పోటీలు పెట్టి అందులో గెలిచిన వారికి మండల విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహిత విద్య ఉపాధ్యాయులు వి.జగన్మోహన్ రావు, హెచ్.అప్పలనాయుడు, సీఆర్పీలు, ఎమ్మార్సీలు పాల్గొన్నారు.

బొబ్బిలి పోలమ్మ, దుర్గమ్మ అమ్మవార్ల సన్నిధిలో కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని కొత్తపేట ప్రాంతంలో వేంచేసి ఉన్న బొబ్బిలి పోలమ్మ, దుర్గమ్మ అమ్మవార్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బొబ్బిలి పోలమ్మ 48వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం పండితుల ఆశీర్వచనాలు పొందారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ మాట్లాడుతూ ఎంతో మహిమగల అమ్మవార్లుగా బొబ్బిలి పోలమ్మ, దుర్గమ్మలు ఇక్కడ కొలువై ఉన్నారన్నారు. అమ్మవారి యొక్క ఆశీస్సులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పైనా, ప్రజల పైనా మెండుగా ఉండాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎంతగానో కృషి చేశారన్నారు. అలాగే నగరాభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలు మరువరానిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు పాటిద్దాం భావితరాలకు మంచి భవిష్యత్తును ఇద్దాం

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఎపి ఈ పి డీ సి ఎల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యుత్ పొదుపు వారోత్సవాలను జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ జెండా ఊపి గురువారం ప్రారంబించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు చేపట్టిన ర్యాలీ నీ జెసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ పొదుపు పాటించడం మానవ జీవితంలో బాగంగా ఉండాలన్నారు. ఇంధన పొదుపు పాటించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు, బవిష్యత్ మంచి వాతావరణాన్ని ఇచ్చిన వారం అవుతామన్నారు. నేడు మానవ జీవితానికి విద్యుత్ ప్రధాన అవసరంగా మారిందని పొదుపు పాటించడం మన బాధ్యతగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. విద్యార్ది దశ నుంచి విద్యుత్ పొదుపు పట్ల అవగాహన కల్పించడం అవసరమన్నారు. అనంతరం విద్యుత్ శాఖ రూపొందించిన పొదుపు వారోత్సవాలు గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్వో అనిత, విద్యుత్ ఎస్ ఈ ఎం.లక్ష్మణరావు విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు వందలమంది పాల్గొన్నారు.

గూడూరులోకి ప్రవేశించిన ఎమ్మెల్సీ రఘురాజు పాదయాత్ర

ఎమ్మెల్సీ రఘురాజుకి ఎంపీపీ తదితరులు సంఘీభావం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : సి.ఎం.జగన్మోహన్‌రెడ్డి మరో సారి ముఖ్యమంత్రి కావాలని దృఢమైన సంకల్పంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేస్తున్న 'జయహో జగనన్న పాదయాత్ర' గురువారం అనగా 37వ రోజు మనుబోలు మండల కేంద్రం వద్దగల కోదండ రామపురం నుండి గూడూరులోకి ప్రవేశించింది. ఎస్.కోట మండలానికి చెందిన నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సహా పాదయాత్రను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కొనసాగించారు.

ఎమ్మెల్సీ రఘురాజుకి సంఘీభావం తెలిపిన ఎంపీపీ తదితరులు : మనుబోలు మండల జె.సి.ఎస్ కన్వీనర్ బి.హరగోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, ఎం.పి.పి ఎ.అనిల్ రెడ్డి, నాయకులు జకీర్, మనోజ్, వెంకట శేషయ్య, జమీర్, కోటేశ్వర గౌడ్, రవీంద్రరెడ్డి, గిరి ఇతర నాయకులు సంఘీభావం తెలియజేయడంతో పాటు పాదయాత్రలో పాల్గొన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్య మంత్రి కావాలని తన గ్రామమైన ఎస్.కోట మండలం, బొడ్డవరలోని తన స్వగృహం నుండి తిరుమలలోని శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనం వరకు 820 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుని మనుబోలు, గూడూరు నేతలు అభినందించారు.

అక్రమంగా కారులో తరలిస్తున్న 200 లీటర్ల నాటుసారా స్వాదీనం

విశాలాంధ్ర - కురుపాం : ముం దస్తు సమాచారం తో కురు పాం సమీపంలో గల మూలిగూడ జంక్షన్‌లో మాటు వేసిన ఎక్సైజ్ మరియు ఎస్ ఈ బి బృందం ఎపి310006 నంబర్ కారులో అక్రమంగా తరలిస్తున్న పది క్యాన్ల నాటుసారా పట్టుకుని ఐదుగురు పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఈబి ఎస్ఒబివి నాగ భూషణం మాట్లాడుతూ బచ్చులి.అఖిల్(25)(రెండో నేరం) బచ్చలి రంజన్ ,జి.కనకదుర్గ (కారు ఓనర్) పిన్నింటి అఖిల్ ,వద్దాది.సురేష్ లపై క్రైం నంబర్ 155/2023కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు.

సర్క్యులర్ అమలు చేయాలి : ఎస్‌డబ్ల్యూఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని ఏపీఎస్ఆర్టీసీ ఎస్ డబ్ల్యు ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య డిమాండ్ చేశారు గురువారం స్థానిక జిల్లా పరిషత్ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ1/2019 సర్క్యులర్ అమలు తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించిన ఈ సర్క్యులర్ ను అమలు చెయ్యకపోవడం అన్యాయమని తెలిపారు. ఈ సర్క్యూలర్ అమలు జరిగితే కార్మికులకు ఉద్యోగ భద్రత భరోసా తో డ్యూటీలో ఓ ఆర్ పెరిగిందని, ఈ సర్క్యులర్ అమలు చేయక పోవడం వలన అభద్రతా భావంతో ఉద్యోగం చేయవలసి వస్తుందని చేప్పారు. ఇతర రాష్ట్రాలలో ఉద్యోగ భద్రత అమలు అవుతున్నా ఏపిపిటిడిలో అమలు అవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సర్క్యులర్ అమలు అయ్యే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శిసీతా లక్ష్మి, చంద్రయ్య, పిటిడి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాధితురాలు కుటుంబానికి లక్ష రూ.1,10,000 చెక్కు అందజేత

ఉపముఖ్యమంత్రి రాజన్న దొర

విశాలాంధ్ర - సాలూరు టౌన్ : నిరంతరం ప్రజల గురించి ఆలోచించే వ్యక్తి జగన్ అని బాధితురాలకు చెక్కు అందించి వారి కష్టాలను ఆదుకున్న మహొాన్న వ్యక్తి అని ఉపముఖ్యమంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడికి రాజన్న దొర కొని యాడారు. గురువారం సాలూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బంగారమ్మ కాలనీ చెందిన రత్నావతి జయరాంకు ఉప ముఖ్యమంత్రి చేతుల మీదగా చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజన్న మాట్లాడుతూ వారి పరిస్థితి బాగోలే అనారోగ్య కారణంగా వారి పరిస్థితి తెలుసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధికి పెట్టించడం జరిగింది అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వారి పట్ల సానుకూలంగా స్పందించి 1,10,000 రూపాయల చెక్కును పంపించారు అన్నారు. ఆ చెక్కును రత్నావతికి వారి నివాసం వద్ద పంపిణీ చేయడం జరిగింది. మా ముఖ్యమంత్రి ప్రజలు కష్టాల్లో ఉంటే చూడలేరని నిరంతరం వారి శ్రేయస్సు కొరకే పోరాటం చేస్తున్నారని వారి పట్ల ఎప్పుడు సానుకూలంగా స్పందిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గిరి రఘు, వైస్ చైర్ పర్సన్ వంగపండు అప్పలనాయుడు,లింగాల సింహాచలం,హరి బాలాజీ పాల్గొన్నారు

మూడోరోజు కొనసాగిన అంగన్వాడీల నిరవధిక సమ్మె సంఘీభావాన్ని ప్రకటించిన టీడీపీ ఇంఛార్జి, నాయకులు

విశాలాంధ్ర - సీతానగరం : అంగన్వాడి కార్యకర్తలకుకనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటి అమలు చేయాలని,మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్ గా మార్చాలనితదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు, సహాయకుల సిబ్బంది మూడో రోజు కూడా నిర్వహించారు. మోకాళ్ళపై నిలబడి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపి నియోజక వర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర, మండల టీడీపీ నాయకులు సంఘీభావాన్ని ప్రకటించారు. వారితో కలసి నిరసనలో కూర్చొని అంగన్వాడి సిబ్బంది సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో హామీ ఇచ్చారని, నేడు మరచారని తెలిపారు. పార్వతీపురంలో సమస్యల పరిష్కారం కోరుతూ 36గంటల దీక్షలు చేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాల నాయుడు, పిఎస్ఎన్ తదితరులతో పాటు సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకట రమణ, అంగన్వాడి అధ్యక్ష, కార్యదర్శులు వెన్నెల రామలక్ష్మి, మరడ సత్యవతి, లక్ష్మి, సునీత, శైలజ,రెడ్డి ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా మండలంలోని అంగన్వాడి కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు గ్రామ వాలంటీర్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ప్రసాద్, ఐసిడిఎస్ పిఓ సుగుణ, సూపర్ వైజర్ పూర్ణిమాలు చెప్పారు. సమ్మె విరమించక పోతే ఎస్మా ఉపయోగిస్తామని హెచ్చరికలు జారీ చేశారు.మరోవైపు తాము సమ్మెలో ఉండగా 24 అంగన్వాడి కేంద్రాల తాళాలను పగలగొట్టి కేంద్రాలను ఏర్పాటు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, యూనియన్ నాయకులు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు.

రంగమ్మపేటలో ఏపీకి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎందుకు కావాలంటే

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని రంగమ్మపేట గ్రామసచివాలయంలో గురువారం సాయంత్రం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం ఎదుట అభివృద్ధి, సంక్షేమం పనులకు సంబంధించి డిజిటల్ సైన్ బోర్డును ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములు, జెడ్పీటీసీ బాబ్జి, మండల పార్టీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, ఎంపిడిఓ ప్రసాద్, ఈఓపిఆర్డీ కుమార్ వర్మ, సచివాలయం సిబ్బంది పాల్గొని ప్రారంభంచేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు. అక్కడ నుండి వీదులలో నినాదాలు చేస్తూ ప్రధాన రోడ్డుకు చేరుకున్నారు. ప్రధాన రోడ్డుపై ఏర్పాటుచేసిన వైఎస్సార్సీపీ జెండాను నాయకులు ఎగురవేసారు. ఇంటింటికీ వెళ్లి కార్యక్రమ ఆవశ్యకత గురించి వివరించారు. వివిధ పథకాల ద్వారా గత నాలుగున్నర ఏళ్లలో డిబిటి, నాన్ డిబిటి ద్వారాకోట్ల రూపాయల పథకాలను లబ్దిదారులకు అందించినట్లు తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి కరపత్రాలు పంపిణీ చేశారు. సిఎం జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గూర్చి వివరించారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్సీపీ విజయంకోసం అంతా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు

జానుమల్లువలసను సందర్శించిన జమ్మాన : మండలంలోని జానుమల్లువలస గ్రామంలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికీ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ఎందుకు అవసరం అన్న కార్యక్రమంలో రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ పాల్గొని సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు గూర్చి వివరించారు. రానున్న సాధారణ ఎన్నికలలో జగన్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు స్తానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

3వ రోజు అంగన్వాడి నిరవధిక సమ్మె

విశాలాంధ్ర - కొమరాడ : 3వ రోజు అంగన్వాడి నిరవక సమ్మె గత మూడు రోజుల నుండి అంగన్వాడి కార్యకర్తలు ధర్నా నిర్వహిస్తున్నారు. మూడవరోజు కొమరాడ గ్రామం వద్ద అంగన్వాడి కార్యకర్తలు ధర్నా నిర్వహించారు కొమరాడ ప్రాజెక్ట్ ఉపాధ్యక్షు రాలు సిరికి అనురాధ మాట్లాడుతూ ప్రతి పక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడి కార్యకర్తలు అన్ని విధాలుగా ఇప్పుడు ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడి కార్యకర్తలు ధర్నాలు చేస్తే అరెస్ట్ చేయటం చాలా అన్యాయమని న్యాయం చేస్తామని ఆమె అన్నారు అంగన్వాడి కార్యకర్తలు సమ్మెకు సంఘీభావం తెలిపిన టిడిపి సిఐటియు నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అంగన్వాడి కార్యకర్తలకు చేపడుతున్న సమ్మెకు టిడిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని సమ్మెలో పాల్గొనాలని పిలిపించారు రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అంగన్వాడి కార్యకర్తలు సమస్యలన్నీ పరిష్కరిస్తారని టిడిపి నాయకులు అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షులు నంగిరెడ్డి మధుసూదన్ రావు అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు మాజీ వైస్ చైర్ పర్సన్ గులిపిల్లి సుదర్శన్ రావు సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి బత్తిరి శీను అంగన్వాడి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.